

'యాప్, వెబ్సైట్' ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్ పిడిసిఎల్) పరిధిలోని వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఎపిఎస్ పిడిసిఎల్ మొబైల్ యాప్ (సదరన్ పవర్) లేదా వెబ్సైట్ ద్వారా చెల్లించాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బిఐ) మార్గదర్శకాల మేరకు ఇకపై వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎమ్ లతోపాటు ఇతర యూపిఐ యాప్స్ ద్వారా నేరుగా విద్యుత్ బిల్లులను చెల్లించే అవకాశం లేదన్నారు. ఎపిఎస్ పిడిసిఎల్ మొబైల్ యాప్ లేదా వెబ్సైట్ ద్వారా బిల్ డెస్క్ కు అనుసంధానమైన ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎమ్ లతోపాటు ఇతర యూపిఐ యాప్స్ నుంచి బిల్లులను చెల్లించవచ్చని వివరించారు. వీటితోపాటు వినియోగదారులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్, క్యాష్ కార్డుల ద్వారా కూడా విద్యుత్ బిల్లును చెల్లించవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తిరుపతి జిల్లా కలెక్టర్‌గా వెంకటేశ్వర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్రంలో అధికార మార్పిడి తరువాత జరుగుతున్న బదిలీల్లో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టర్‌గా సలిజామల వెంకటేశ్వర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వివిధ జిల్లాలకు కొత్త కలెక్టర్లకు ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. గుంటూరు జిల్లా నల్లపాడుకు చెందిన సలిజమల వెంకటేశ్వర్ తిరుపతి జిల్లా కలెక్టర్‌గా రానున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రవీణ్‌కుమార్ ఉద్యోగోన్నతిపై విజయవాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వెంకటేశ్వర్‌ను నియమించారు. త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. గుంటూరు జిల్లా నల్లపాడుకు చెందిన సామాన్య రైతు వెంకయ్య కుమారుడు వెంకటేశ్వర్ యుపిఎస్‌సిలో 216 ర్యాంకు సాధించారు. నల్లపాడులో లయోలా కాలేజీలో విద్యనభ్యసించారు. విశాఖపట్నం శ్రీ చైతన్యలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. బైపిసి తీసుకున్న వెంకటేశ్వర్ ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించి 2012లో ఎంబిబిఎస్ ఉత్తీర్ణత సాధించారు. సివిల్ సర్వీసు కోసం మూడుసార్లు ప్రయత్నించారు. ఆఖరిగా ఐఎఎస్ సాధించారు. తన విజయం వెనుక తన తండ్రి ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వెంకటేశ్వర్ ప్రజలకు సేవ చేయాలన్న ధ్యేయంతోనే సివిల్స్ ర్యాంకు సాధించినట్లు మీడియాకు తెలిపారు. 2016లో ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన వెంకటేశ్వర్ మాతృ రాష్ట్రంలోనే పని చేయాలనుకున్నారు. విశాఖ జిల్లా పాడేరు సబ్ కలెక్టర్‌గా తొలుత బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత చిత్తూరు జిల్లా జేసీగా ఉన్నారు. రాష్ట్ర వైద్య విభాగంలో డైరెక్టర్‌గా ఉన్నారు. ప్రస్తుతం తిరుపతి జిల్లాకు కలెక్టర్‌గా రానున్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

'నేను బడికి పోతా' ర్యాలీలో డిఇఒ

ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట మండలం కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్ హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం బడి మానేసిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించారు. కరకంబాడి సమీపంలోని సిమెంటు ఇటుకల తయారీ ప్రాంతం, కోళ్ల ఫారాల సమీప ప్రాంతం, చైతన్యపురంలో గల బడి మానేసిన విద్యార్థులను కరకంబాడి ఉన్నత పాఠశాలలో చర్పించి వారిని క్రమంగా బడికి పంపాలని వారి తల్లి తండ్రులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 12వ తేదీ లోపు బడి మానేసిన పిల్లలను గుర్తించి మళ్లీ బడిలో చేర్పించాలని పిలుపునిచ్చారు. వయసుకు తగిన తరగతిలోకి చేర్చి ఆ తరగతిస్థాయి అందుకునేందుకు బ్రిడ్జ్ కోర్సును ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఇందిరాదేవి, రంగనాథం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్పలత, సమగ్ర శిక్ష జిల్లా అధికారులు మధు, రుక్మాంగద, సారథి, గోపాల్, రాము, సిఆర్ఎంటి హేమలత, ఉపాధ్యాయులు ముత్యాల రెడ్డి, రామచంద్రయ్య, రవీంద్ర పాల్గొన్నారు. **కెవిబిపురంలో..** మండలంలోని ఓలూరు గిరిజన కాలనీలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమంలో భాగంగా మండల విద్యాశాఖ అధికారులు ప్రజా ప్రగతి ట్రస్ట్ సంయుక్తంగా ఇంటింటా తిరిగి బడికి రాని పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులను కలిసి ప్రతి విద్యార్థిని తప్పక బడికి పంపించాలని అవగాహన కల్పించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీపతి, రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న స్టూడెంట్ కిట్స్, మధ్యాహ్న భోజన పథకం పాఠశాలకు వచ్చే ప్రతి పిల్లవాడికి అందుతుందని, వారి తల్లులకు అకౌంట్లో 15 వేల రూపాయలు తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా వస్తుందని, ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య తోపాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, డిక్షనరీ, యూనిఫామ్స్ నాణ్యమైన పోషకాహారం అందిస్తున్నారని తెలిపారు. ప్రజాప్రగతి ట్రస్ట్ కోఆర్డినేటర్లు వేణుగోపాల్, చంద్రశేఖర్ గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి పిల్లల తల్లిదండ్రులు కలిసి ప్రతి బిడ్డను బడికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ రెడ్డి, అంగన్వాడి టీచర్ వెంకటరత్నమ్మ పాల్గొన్నారు**బిఎన్ కండ్రిగలో..** కన్నమనంబేడు గాజులపెళ్లూరు పంచాయతీలో గిరిజన కాలనీలోని ఎంపిపి పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి కె.రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంట

ప్రజాశక్తి - యర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు

ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చు తగ్గి నాణ్యమైన దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ భాస్కరయ్య తెలిపారు. యర్రావారిపాలెం మండలం నెరబైలు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో 'ఆత్మ' సహకారంతో రైతులకు శిక్షణ ఇచ్చారు. స్థానికంగా దొరికే సేంద్రీయ వనరులను వినియోగించి సాగు చేస్తే, రసాయన పురుగు మందుల ఎరువులపై రైతులు పెట్టే ఖర్చు తగ్గిపోతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో నేలలో జీవం పెరిగి ఆరోగ్యంగా ఉండి రసాయనిక అవశేషాలు లేని ఆహారం ప్రజలకు అందుతుందన్నారు. మామిడి, టమోటా పంటల్లో ఆచరించాల్సిన ప్రకృతిసాగు పద్ధతులను వివరించారు. మండల కేంద్రం ఎఒ వేణుగోపాల్‌రావు వేరుశనగ పంటల్లో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. మండల వ్యవసాయ అధికారి ఖాదర్‌బాష, వ్యవసాయ విస్తరణ సహాయకులు నళినిదేవి, మునిశేఖర్, రాజశేఖర్ పాల్గొన్నారు. చిన్నగొట్టిగల్లు మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలోనూ రైతులకు శిక్షణ ఇచ్చారు.

అనావృష్టితో బెట్ట పరిస్థితులు, అకాల వర్షాలు, పంటలలో కొత్త రకాల చీడలు వాతావరణ మార్పుల వలన రైతులకు ఇబ్బంది కలిగిస్తున్నాయని తెలిపారు.

రామచంద్రాపురంలో.. ఖరీఫ్‌లో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, పంటలు వేసుకోడానికి పదును అదునుగా ఉందని డిపిఎం షన్ముగం తెలిపారు. మంగళవారం మండలంలోని అనుపల్లి, సి.కాళేపల్లి, నెత్తకుప్పం, వేపకుప్పం, రాయలచెరువు , కుప్పంబాదూరు గ్రామాలలో ప్రకతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన పలు పంట పొలాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వైఎస్ఎస్ రాష్ట్ర సీనియర్ కన్సల్టెంట్ సురేంద్ర రెడ్డి, అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులపై సమీక్ష

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నగరంలో అత్యాధునిక సాంకేతక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, ఏఈకామ్, కాంట్రాక్టు ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అదితిసింగ్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు ఆలస్యం అవుతోందని, త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న ఈ సెంటర్ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కేంద్రం ద్వారా నగరంలో భద్రత మరింత పెరుగుతుందని, నగరంలో ఏ మూల ఏమి జరిగినా క్షణాల్లో తెలిసే విధంగా సెంటర్ పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

'శ్రీవాణి' అక్రమాలపై విజిలెన్స్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

'శ్రీవారి ట్రస్ట్ నిధులు ఎక్కడికి మళ్లించారని, భక్తులు ఎంత డిపాజిట్ చేశారని, ఆ మొత్తం ఏ సంస్థకు, ఆలయాల నిర్మాణానికి ఇచ్చారని, వాటిపై శ్రీవారి భక్తులకు అనుమానాలు ఉన్నాయని, తక్షణమే దర్యాప్తు చేపట్టి నిజా నిజాలు ప్రజలకు తెలియజేయాలి' అని మంగళవారం తిరుపతి స్టేట్ విజిలెన్స్ కార్యాలయం నందు కిరణ్ రాయల్ జనసేన నేతలతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీవాణి ట్రస్ట్ నిధులలో అవకతవకలు జరిగాయని గతంలో పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు ఈ విషయంపై మాట్లాడారని, అవన్నీ వాస్తవమేనని, గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఐదేళ్లలో తిరుమలలో శ్రీవాణి ట్రస్ట్, దర్శనాల పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలు చేశారని, వాటిమీద పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని విజిలెన్స్ అధికారులను కోరామన్నారు. అలాగే గత ప్రభుత్వంలో మంత్రులకు ఇచ్చిన సేవా టికెట్లు, విఐపి బ్రేక్ దర్శన టికెట్లు అన్నింటిపై విచారించి, దర్యాప్తు చేయాలన్నారు. గత 5 సంవత్సరాలలో 2019 జూన్ నుంచి 2024 మే వరకు ఇచ్చిన టికెట్లలో దాదాపు కొన్నివేల టికెట్ల మీద అక్రమంగా వ్యాపారాలు జరిగాయన్నారు, దర్శనాల పేరుతో లాబీయింగ్ చేసుకొని దోచుకున్నారని కిరణ్ రాయల్ స్పష్టం చేశారు. వీటన్నిటిపై విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు సుభాషిని, హేమ కుమార్, చందన, ప్రసాద్, దుర్గ, వినోద్, కిషోర్ పాల్గొన్నారు.

భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గంలో వెళ్లే భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతి శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ అటవీ, టీటీడీ అటవీ, ఇంజనీరింగ్, భద్రత విభాగాలతో కాలిబాట భక్తుల భద్రత చర్యలపై ఈవో సమీక్షించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ట్రాప్ కెమెరాలే కాకుండా చిరుతలు, ఇతర జంతువుల సంచారం తెలుసుకొనేందుకు మరిన్ని ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుండి ఏడవ మైల్ వరకు సంచరించే జంతువుల కదలికలు ఎప్పటి కప్పుడు కంట్రోల్ రూంకు తెలిసేలా సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన అధికారులతో చర్చించి, తగు చర్యలు తీసుకోవాల్సిందిగా జేఈవో వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్వో నరసింహ కిషోర్‌కు సూచించారు. అంతకుముందు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంయుక్త కమిటీ ప్రతిపాదనలు, వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా వారిచ్చిన ప్రతిపాదనలను అటవీ విభాగం అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ఎస్వి జూ పార్క్ క్యూ రేటర్ సెల్వం, తిరుపతి డిఎఫ్ఓ సతీష్, సబ్ డిఎఫ్ఓ శ్రీనివాస్, సిఈ నాగేశ్వరరావు, ఎస్ఈ 2 జగదీశ్వర్ రెడ్డి, టిటిడి డిఎఫ్ఓ శ్రీనివాస్, పంచాయతీ ప్రత్యేక అధికారి మల్లికార్జున్, ఆరోగ్య శాఖ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

తిరుమలలో 'సిఫార్సు'లతో వైసిపి తిష్ట

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సిఫార్సులతో పాటు పదవులను అడ్డుపెట్టుకుని వైఎస్సార్సీపీ పాలనలో మంత్రులు నెలలో రెండు, మూడు సార్లు శ్రీవారి దర్శనానికి వస్తూ సామాన్య భక్తులకు ఇబ్బందులకు గురి చేశారు. మాజీ మంత్రులు రోజా, వేణుగోపాలకష్ణ, నారాయణస్వామి, మేరుగ నాగార్జున, కారుమూరి నాగేశ్వరావు , ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, గోరంట్ల మాధవ్, బెల్లాన చంద్రశేఖర్ మందీమార్బలంతో, సకల లాంఛనాలతో దర్శనం చేసుకోగా, సామాన్య భక్తులను ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలున్నాయి.

ఎన్డీయే కూటమి సుపరిపాలన తిరుమల ప్రక్షాళన నుంచే ప్రారంభం అవుతుందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో టీటీడీలో ఒక్కొక్కటిగా మార్పులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే రోజుకు వందల సంఖ్యలో వీఐపీ బ్రేక్ దర్శనాలు తీసుకొన్న అమాత్యుల అక్రమాలు బయటకు వస్తున్నాయి. వ్యక్తిగత, రాజకీయ లబ్ధి కోసం తిరుమలలో హవా చూపించుకునేందుకు గత ప్రభుత్వ మంత్రులు తమ సిఫారసు లేఖలతో భారీగా వీఐపీ బ్రేక్ దర్శనాలు పొందిన ఘటనలు కలకలం రేపుతున్నాయి.

తక్కువ సిఫార్సులు చేస్తానని చెప్పుకున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 12న ఒక్కరోజే బ్రేక్ దర్శనాలు, ఆర్జిత సేవలకు 74 మందిని సిఫార్సు చేసిన తీరు తీవ్ర చర్చనీయాంశమైంది. తోమాలసేవకు నలుగురు, ప్రొటోకాల్ బ్రేక్ దర్శనాలకు ఆరుగురు, 12 మందికి కల్యాణోత్సవం, 52 మందికి వీఐపీ బ్రేక్ దర్శనాలు చొప్పున తమ అనుచరులను పంపారు.

పదుల సంఖ్యలో టికెట్లు పొందిన నేతలు

మాజీ మంత్రి రోజా ఏపీఐఐసీ ఛైర్మన్ హోదాలో 2021 నవంబర్ నెలలో భక్తుల పేర్లు కూడా లేకుండా 20 మందికి బ్రేక్ దర్శనాలు కేటాయించాలని సిఫార్సు చేశారు. మాజీ ఉప ముఖ్య మంత్రి నారాయణస్వామితో పాటు పలువురు మంత్రులు రోజుకు పదుల సంఖ్యలో వీఐపీ బ్రేక్ దర్శనం, ఆర్జిత సేవా టికెట్లు పొంది, సామాన్య భక్తులు క్యూలైన్లో అగచాట్లు పడేలా చేశారు.

ఆర్వో ఫిల్టర్ బహుకరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి జిల్లా డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ఆర్‌బిఎస్‌కే కి మంగళవారం డిఎంహెచ్వో డాక్టర్ యు శ్రీహరి చేతుల మీదుగా ఉయ్ సపోర్ట్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు తహస్సు బేగం, సభ్యులు వీరశేఖర్ సౌమ్య, షర్మిల వారిచే ఆర్వో ఫిల్టర్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ శ్రీహరి మాట్లాడుతూ ఆటిజం వున్న పిల్లలకు ఇక్కడ చికిత్స అందిస్తారని, ఆ సమస్య గల పిల్లలను ఇక్కడకు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, పీడియాట్రిషియన్ డాక్టర్ ప్రదీప్, మేనేజర్ డాక్టర్ గుణశేఖర్ పాల్గొన్నారు.

ఏహెచ్‌ను అభివృద్ధి చేస్తాం : బొజ్జల బృందమ్మ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి సతీమణి బొజ్జల బందమ్మ హామీ ఇచ్చారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత పాలకులు ఏరియా ఆసుపత్రి అభివృద్ధిని విస్మరించారని మండిపడ్డారు. కొన్ని వార్డుల్లో బెడ్లు లేవని అసంతప్తిని వ్యక్తం చేశారు. మరో రెండు నెలల్లో ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో అభివద్ధి చేసి చూపిస్తామని స్పష్టం చేశారు.

బాలికలకు బెడ్ షీట్లు పంపిణీ

స్థానిక నం.1, నం.2 బాలికల సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మంగళవారం బొజ్జల బందమ్మ బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. విద్యార్థినులు బాగా చదువుకోవాలనీ, మీ అవసరాలన్నిటిని తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, హాస్టల్‌కు పేరు తీసుకురావాలని సూచించారు.

చెత్త నిర్వహణ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో ఉత్పత్తి అయ్యే చెత్త నిర్వహణ కేంద్రాన్ని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ మంగళవారం పరిశీలించారు. నగరంలో సేకరించిన చెత్తను తూకివాకం వద్ద గల చెత్త నిర్వహణ కేంద్రానికి వేర్వేరుగా తరలిస్తారు. నగరం నుండి సేకరించిన తడి చెత్త (ప్లాస్టిక్) ద్వారా ఎరువు, పొడి చెత్త ద్వారా వచ్చిన వ్యర్థాలను సిమెంట్ ఫాక్టరీలకు తరలిస్తారని, మార్కెట్, కూరగాయల వ్యర్థాల నుండి గ్యాస్ ఉత్పత్తి చేసే విధానాన్ని ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. అలాగే మురుగునీటి నిర్వహణ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ను పరిశీలించారు. అంతకుముందు నగరంలో బైరాగిపట్టెడ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులను, తాగునీరు, మురుగునీటి కాలువలను పరిశీలించారు. రానున్నది వర్షాకాలం అని, పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని అన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. కమిషనర్ వెంట ఉప కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, డి.ఈ. విజయకుమార్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య, సుమతి ఉన్నారు.

తిరుపతిలో షాడో వ్యవహారాలు మానుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆయన బదులు తన కుమారులను పంపి సమీక్షలు నిర్వహించటం, ఉన్నత స్థాయి అధికారులతో కూర్చుని మాట్లాడటం ఐఏఎస్ లతో సహా అధికారులు 'జీ... హుజూర్' అంటూ సమావేశాలలో పాల్గొనటం మానుకోవాలని సిపిఎం నేత కందారపు మురళి సూచించారు. తిరుపతి అభివద్ధి పై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమీక్ష చేసి ఉంటే బాగుండేదని, కాకపోతే ఆయన అన్న కుమారుడు శివకుమార్ సమీక్షించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇలాంటి సాంప్రదాయాలు తిరుపతిలో కొనసాగించవద్దని సూచించారు.

చెత్త కేంద్రం.. ప్లాస్టిక్‌మయం..!

మూగజీవాల ప్రాణాలకు ముప్ప

శెట్టిపల్లి చెత్త సంపద కేంద్రం దుస్థితి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో ప్రజల నివాస ప్రాంతాల నుండి చెత్తను సేకరించి తద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలనే ఉన్నత లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా చెత్త నుండి సంపద కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. నీరు గారి పోతున్న చెత్త నుండి సంపద కేంద్రాల లక్ష్యంపై ప్రజాశక్తి కథనం.

గ్రామీణ ప్రాంతాల్లో ఆయా పంచాయతీల్లో చెత్త నుండి సంపద కేంద్రాలను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసి వాటి అమ్మకం ద్వారా వచ్చిన ధనాన్ని పంచాయతీ అవసరాలకు, ప్రజా ప్రయోజనాల కార్యక్రమాలకు ఉపయోగించాలని ఏర్పాటు చేసిన మంచి లక్ష్యం గత ఐదేళ్ల హయాంలో నీరుగారిందనే చెప్పాలి. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో అప్పటి సర్పంచి బత్తల స్వప్న కార్యవర్గం పంచాయతీ పరిధిలోని ఎస్వీ కాలేజీ సమీపంలో రెవెన్యూ అధికారులు చెత్త నుండి సంపద కేంద్రం ఏర్పాటుకు దాదాపు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అప్పట్లో చెత్త నుండి సంపద కేంద్రాల నిర్మాణం రీసైక్లింగ్ గా ఉండాలనే ఉద్దేశంతో వెదురు కర్రలతో పూర్తిగా నిర్మాణం చేపట్టారు. చెత్త నుండి సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీకి, చెత్తలోని వ్యర్థాలను వేరుచేసి త ం లి ం చ డా ని కి ఉపయోగకరంగా చిన్నపాటి తొట్టెలను నిర్మించారు. అయితే అప్పట్లో వెదురు కర్రలతో నిర్మించిన చెత్త నుండి సంపద కేంద్రం తీవ్ర వర్షాలకు పూర్తిగా కుంగిపోయింది. లక్ష్యం నీరుగార కూడదని రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు అధికారులు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హాయంలో ఉమ్మడి శెట్టిపల్లి పంచాయితీ ఐదు పంచాయతీలుగా విభజింపబడటం, శెట్టిపల్లి గ్రామ పరిధిలోని ఐదు ప్రజా నివాస ప్రాంతాలు తిరుపతి నగరపాలక సంస్థలో కలిసిపోవడంతో మిగిలిన ప్రజా నివాస ప్రాంతాలను ఏకం చేస్తూ న్యూ మంగళం పంచాయతీగా అధికారులు ఏర్పాటు చేశారు. విభజింపబడ్డ పంచాయతీలలో తిరుమల నగర్, సప్తగిరి కాలనీ, మంగళం క్వార్టర్స్, రణధీరపురం, న్యూ మంగళం గ్రామపంచాయతీల నుండి ఆయా పంచాయతీలకు చెందిన చెత్త తరలింపు వాహనం(ట్రాక్టర్)తో రోజుకు దాదాపు పది ట్రాక్టర్ల ద్వారా చెత్తను ఇక్కడ డంప్ చేస్తున్నారు. అయితే చెత్త నిర్వహణ కోసం గతంలో ఇక్కడ పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేశారు. పంచాయతీలు విభజింపబడ్డ తర్వాత ఏ పారిశుద్ధ్య సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహించడం లేదు.

పంచాయతీల్లో విధులు నిర్వహించే పారిశుద్ధ సిబ్బంది ప్రజా నివాస ప్రాంతాల నుండి చెత్తను సేకరించి ట్రాక్టర్ ద్వారా ఇక్కడకు డంపు చేయడానికి మాత్రమే పనిచేస్తున్నారు.

ఆవులకు ఆహారంగా ప్లాస్టిక్

చెత్త నిర్వహణ లేకపోవడంతో.....

చెత్త నుండి సంపద కేంద్రంలో చెత్త నిర్వహణ కరువు అవడంతో రోడ్లపై తిరిగే ఆవులు చెత్త నుండి సంపద కేంద్రంలో డంపు చేయబడ్డ చెత్త నిల్వలలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తిని వాటి ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నాయి. మరోవైపు చెత్త నుండి సంపద కేంద్రం సమీపంలో ఇరిగేషన్ కు సంబంధించిన పెద్ద కాలువ ప్రవహిస్తోంది. చెత్త నిర్వహణ సిబ్బంది లేకపోవడంతో డంపు చేయబడ్డ వ్యర్థాలు ఆ నీటిలో కొట్టుకొని పోయి చెరువులకు చేరుతున్నాయి. దీని ద్వారా ఆ చెరువుల్లో పెరిగే జీవరాశులకు ముప్పు వాటితోంది. అందులో పట్టే చేపలను ఆహారంగా స్వీకరించడం వలన కూడా మానవాళికి ప్రమాదం పొంచి ఉంది.

ప్లాస్టిక్‌తో నిండిపోయిన చెత్తకేంద్రం

మంచి లక్ష్యానికి తూట్లు....

గత టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా, ప్రయోగాత్మకంగా చెత్త నుండి సంపద కేంద్రాలను యుద్ధ ప్రతిపాదికన ఏర్పాటు చేశారు. వర్మీ కంపోస్టు తయారీ ద్వారా ఆదాయం అర్జించే వనరులు ఉన్నాయని ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపించింది. ప్లాస్టిక్ వస్తువులను సేకరించి తద్వారా రీసైక్లింగ్ ప్రాసెస్ కు ఉపయోగపడే వస్తువులను చెత్త నుండి సంపద కేంద్రానికి వచ్చిన చెత్త డంప్ నుండి పారిశుద్ధ్య సిబ్బంది సేకరించేవారు. విదేశాల్లో అనుసరిస్తున్న విధానాన్ని ఇక్కడ అమలు చేయాలని అప్పటి ప్రభుత్వ పాలకులు యోచించిన లక్ష్యాలను చేరుకోలేకనే చెత్త నుండి సంపద కేంద్రాలు కనుమరుగైపోయాయి. చెత్త నుండి సంపద కేంద్రాల నిర్వహణ కోసం అప్పట్లో అధికారులకు ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహించారు. ఉత్తమ నిర్వహణ ప్రతిభను కనబరిచిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం అప్పట్లో మంచి సత్కారాలను అందజేసింది. ఇప్పటికైనా చెత్త నుండి సంపద కేంద్రాల దుస్థితిని అధికారులు మారుస్తారో లేదో వేచి చూడాలి.

రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ

రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేస్తున్న ఎల్ఐసి యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం వారోత్సవాల్లో భాగంగా ఎల్ఐసి ఉద్యోగులు పుత్తూరు ప్రభుత్వ వైద్యశాల రోగులకు వైద్యాధికారి ఉదయ్, ఫార్మసీ అన్నాదొరై, హెడ్నర్స్ దిల్ షాద్ చేతుల మీదుగా మంగళవారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఎన్ లక్ష్మణ కుమార్, మాట్లాడుతూ తమ యూనియన్ సామాజిక సేవా కార్యక్రమంలో ఎల్లవేళలా ముందుంటుందని తెలిపారు. ఈ నెల ఐదవ తేదీ శుక్రవారం ఎల్ఐసి కార్యాలయ ఆవరణలో స్విమ్స్, బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదానం చేపడుతున్నారని, ఆసక్తి కలిగిన వారు దస్తగిరి 9949051900, లక్ష్మణ కుమార్ 9440844925 ఫోను నెంబర్లను సంప్రదిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు ఆంజనేయు లు, గణేష్ బాబు, రాజేష్, ప్రవీణ్, రామకృష్ణ, యూనియన్ నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీరామ్ కాలనీలో అధికారుల పర్యటన

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం తొట్టంబేడు పంచాయతీ శ్రీరామ్ కాలనీలో అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. కాలనీ వాసులకు సరఫరా చేస్తున్న మంచి నీటి నాణ్యతను పరిశీలించింది. ఆ మేరకు మంచినీటి నమూనాలను పరీక్ష నిమిత్తం ల్యాబ్కు పంపారు. 'శ్రీరామ్ కాలనీలో తాగునీరు కలుషితం' అన్న శీర్షికన మంగళవారం ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైంది. ఆ మేరకు స్పందించిన తొట్టంబేడు ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ శంకర్ రెడ్డి వారి బృందంతో శ్రీరామ్ కాలనీ కి వెళ్లి తాగునీటికి వినియోగిస్తున్న బోర్లను, కుళాయిలను పరిశీలించారు. పలుచోట్ల కుళాయిలు దెబ్బ తినడంతో హుటాహుటిన మరమ్మతులు చేయించారు. డయేరియా బారిన పడకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ మోహన్ నాయుడు, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ మమత, ఈవోపిఆర్డి కరుణాక్షి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంకయ్య, హెల్త్ సూపరువైజర్ రత్నాకర్, ఏఎన్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా తాము మొక్కలు నాటుతున్నామని ఆంధ్ర మహిళ మండలి గౌరవ అధ్యక్షురాలు, పట్టణ ప్రముఖ వైద్యురాలు డాక్టర్ రోహిణి తెలిపారు. గూడూరులోని సరస్వతి శిశు మందిరం ప్రాంగణంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణ పరిధిలో అనేక ప్రాంతాల్లో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

బహుమతుల ప్రదానోత్సవంలో డాక్టర్ జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని, క్రీడలను ప్రోత్సహించేందుకు తాము ముందు ఉంటామని సీనియర్ రోటేరియన్, పట్టణ ప్రముఖ వైద్యుడు డాక్టర్ జనార్దన్ రెడ్డి ప్రకటించారు. గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆదిశేషారెడ్డి జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ప్రముఖ పట్టణ వైద్యుడు డాక్టర్ జనార్ధన్రెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియం లో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్లో పెద్ద సంఖ్యలో టీంలు పాల్గొనడం ఆనందంగా ఉందని భవిష్యత్తులో నిర్వహించే క్రీడా పోటీలలో అత్యధిక సంఖ్యలో టీంలు పాల్గొనేలా విద్యాసంస్థలకు చెందిన పీఈటీలతోపాటు రోటరీ క్లబ్ సభ్యులు చొరవ తీసుకోవాలని సూచించారు. క్రీడలను ప్రోత్సహిస్తూ నిర్వహించే కార్యక్రమాలకు తాము ఆర్థికంగా సహకారం అందిస్తామని తెలిపారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని గెలుపు ఓటములను పరిగణనలోకి తీసుకోకూ డదన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

ప్రజల పక్షమని నిరూపించాం: టిడిపి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పింఛన్ల పెంపుతో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజల పక్షమని నిరూపితమైందని పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలో 4.03 కోట్ల రూపాయలు పంపిణీ చేశామని పుత్తూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు జి.జీవరత్నం నాయుడు, ప్రధానకార్యదర్శి ఎస్ఎన్ధనపాల్ పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో వారు మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీ ఒక్క రోజులో విజయవంతంగా పూర్తి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలో 5,836 మందికి 4.03కోట్ల రూపాయలను వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు వారి వారి ఇంటివద్దకే వెళ్లి అందించామని తెలిపారు.

రాజ్యపురస్కార్ అవార్డులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని బాబూఅగ్రహారం పురపాలక సంఘం ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు స్కౌట్స్ విద్యార్థులు ప్రతిష్టాత్మక రాజ్య పురస్కార్ అవార్డులకు ఎంపికయ్యారు. వీరిలో పి వివేక్, పి మురళీ కృష్ణ, ఎస్ శ్రీనివాసులు, ఎ యశ్వంత్, జె లోకేష్లు ఉన్నారు. గుంటూరులోని తాడికొండలో ఉన్న రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఈ ఏడాది ఏప్రిల్ 24 నుండి 28వ తేదీ వరకు నిర్వహించిన రాజ్యపురస్కార్ పరీక్షా శిబిరంలో వీరు పాల్గొని అవార్డులకు అర్హత పొందారు. వీరికి రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షులు అబ్దుల్ నజీర్ సంతకంతో కూడిన సర్టిఫికెట్స్ అందజేస్తారు. ఈ సందర్భంగా వీరికి శిక్షణ ఇచ్చిన ఎస్ కె జబూరుద్దీన్ను కమిషనర్ ఎం ఎం రెడ్డి, టి. రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి ఎం. జయరాం, సహాయ కమిషనర్ పార్వతి, డిటిసి సావిత్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యానప్ప, ఉపాధ్యాయులు యోగానంద తదితరులు అభినందించారు.

వర్సిటీలలో బోధనేతర సిబ్బంది వయస్సు పెంచండి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేసే బోధనేతర సిబ్బంది వయసును 60 నుంచి 62 ఏళ్ల వరకు పెంచాలని కోరుతూ విశ్వవిద్యాలయాల బోధనేతర సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మంగళవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాల జీవోను గవర్నమెంట్ ఉద్యోగస్తులకు ఇంప్లిమెంట్ చేసిన నాటి నుండి అనగా 1.1.2022వ సంవత్సరం నుండి విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్నటువంటి ఉద్యోగస్తులకు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పికే సుబ్రహ్మణ్యం, రవి కుమార్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ఉద్యోగులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గం లోని పుత్తూరు పట్టణానికి చెందిన వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, పుత్తూరు పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఇ. హేమాద్రి ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రభుత్వ ఉద్యోగస్తులు నగరి నియోజకవర్గం ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పోస్టల్ బ్రాంచ్ అసిస్టెంట్ జ్యోతి, తమిళ్ మురళీమోహన్ కుమార్తె చంద్రవదనని పుట్టిన రోజు వేడుకలు నగరి నియోజక వర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సమక్షంలో వారి నివాసంలో ఎమ్మెల్యే ఆశీస్సులు తీసుకున్నారు.

'కెనడా డే' పోటీల్లో విజేతలు

పేరూరు బాలసుబ్రమణ్యం యం.ఆర్.అరుణ కుమారి రాచపూటి రమేష్

ప్రజాశక్తి - క్యాంపస్ : తెలుగు తల్లి కెనడా మాసపత్రిక కెనడా డే సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే అంతర్జాతీయ కవితలు, కథలు పోటీల్లో 2024వ సంవత్సరానికి సంబంధించి తిరుపతి జిల్లాకు చెందిన కవి, కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం కవితల్లో విజేతగా నిలిచారు. వీరితో పాటు కథా రచయిత్రి యంఆర్ అరుణకుమారి రాసిన 'మరుజన్మకు నువ్వే' కథకు, రచయిత రాచపూటి రమేష్ రాసిన 'ఆ నాటి చెలిమి ఒక..' కథకు బహుమతులు వచ్చాయి. పేరూరు బాలసుబ్రమణ్యంకు 2020 'ఆటగదరా శివా!' కథకు, 2023 లో 'ప్రాణ దాతలు' కవితకు బహుమతులు రాగా ఈ ఏడాది మూడవ సారి 'నాన్న!' కవిత బహుమతికి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా వారిని అభ్యు దయ రచయి తల సంఘం నేతలు సాకం నాగరాజ, యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, రచయితలు ఆర్సికెరాజు, మన్నవ గంగాధర ప్రసాద్, వాకా ప్రసాద్, తదితర సాహితీ ప్రియులు అభినందించారు.

డిఎస్సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ

బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర రావు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, ఆంధ్రప్రదేశ్, విజయవాడ వారి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ బి.సి. స్టడీ సర్కిల్, తిరుపతి నందు డిఎస్సి పరీక్షల ఉచిత శిక్షణకు వెనుకబడిన తరగతులు (బి.సి.) షెడ్యూల్డ్ కులాలు (యస్.సి.), షెడ్యూల్డ్ తెగలకు (యస్.టి) చెందిన అభ్యర్థులు డిఎస్సికి ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని, 200 మంది అభ్యర్థులకు ఈనెల 15వ తేదీ నుండి 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్ , స్టడీ మెటీరియల్ అందిస్తామని కలెక్టర్ కార్యాలయం పేర్కొంది. బిఇడి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు బి. ఇడి. ప్రొవిజనల్ సర్టిఫికేట్ 10వ తరగతి, ఇంటర్ , డిగ్రీ మార్కులిస్టులు, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ పత్రం (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1లక్ష లోపు మాత్రమే) ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, 3 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు జతపరచి డి. ఎస్సీ అభ్యర్థులు ఈనెల 10వ తేదీ లోపు ఆంధ్రప్రదేశ్ బి.సి. స్టడీ సర్కిల్, 4-171/2, మొదటి క్రాస్, శ్రీకృష్ణ నగర్, ముత్యాలరెడ్డి పల్లి, తిరుపతి నందు మీ దరఖాస్తులు అందించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు నేరుగా కార్యాలయంలో లేదా ఫోన్ నెంబరు 9346221553, 9490733351 , 9441456039 ఫోను నెంబర్లను సంప్రదించాలన్నారు.

రేపు విద్యా సంస్థల బంద్ను జయప్రదం చేయండి..

- ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకుల పిలుపు

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఈ నెల 4వ తేదీ గురువారం నిర్వహించనున్న విద్యా సంస్థల బంద్ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ పుత్తూరు పట్టణ అధ్యక్షులు దిలీప్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు డి మహేష్ పిలుపు నిచ్చారు. స్థానిక ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఉమ్మడి విద్యార్థుల సంఘ నాయకులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దిలీప్, డి మహేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా విద్యా సంస్థలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులు భర్తీ చేయాలని, విద్యా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్పొరేట్ పాఠశాల ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. అసమర్ధ ఎన్డియే ప్రభుత్వాన్ని రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండు చేశారు. ఇటీవల నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ టిఐఎస్ఎస్ ముంబై ఐఐటి ముంబై, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు పోరాటం చేశారని, వారిపై అక్రమ కేసులు, నిర్బంధాలు యూనివర్సి టీల్లో స్వేచ్ఛ ప్రక్రియను, ప్రజాస్వామ్యం అణచివేత చర్యలు ఆపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వ హిస్తున్న పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. పీహెచ్డి అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. వివిధ సమస్యల పై ఐక్య విద్యార్థి సంఘాలు దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్కు పిలుపు నిచ్చాయన్నారు. ఈ విద్యా సంస్థల బంద్ జయప్రదానికి విద్యార్థులు, మేధావులు, ఉపాధ్యా యులు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల మేధావులు, విద్యార్థి తల్లిదండ్రులు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు విక్రమ్, కలై పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: ఈనెల నాలుగో తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలని పిడిఎస్ యూ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆ సంఘాల నాయకులు మంగళవారం స్థానిక పిడిఎస్యూ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీడీఎస్ యూ రాష్ట్ర కోశాధికారి జాకీర్, ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి ముని చందు మాట్లాడుతూ కేంద్రం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఎ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. నీట్ పరీక్ష లీకేజీ తెరవెనుక కుంభకోణం, నీట్ పిజి పరీక్షను 12 గంటల ముందు వాయిదా వేయడం, యూజిసి నెట్ పరీక్ష రద్దు చేయడం వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించాయన్నారు. నీట్ స్కామ్ పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్యా పరిస్థితి దారుణంగా తయారుచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గించేశారన్నారు. 2018-19, 2021-22 మధ్య దేశంలో 61885 పాఠశాలలు మూసివేసి పేద విద్యార్థులకు విద్యను దూరం చేసిన ఘనత మోడీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు.

బోగస్ పింఛన్లపై విచారణ చేపట్టండి..

- ఎంపిడివోకు టిడిపి నాయకుల ఫిర్యాదు

ఎంపిడివో ప్రత్యూషకు వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -రామచంద్రపురం: మండలంలోని కమ్మపల్లి పంచాయతీ కమ్మపల్లిలో మురళీకృష్ణ వికలాంగుడు (ప్రత్యేక ప్రతిభా వంతుడు కాకపోయినా) పింఛనుకు అనర్హుడైనా వైసిపికి చెందిన వ్యక్తి కావడంతో గత ప్రభుత్వంలో బోగస్ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి సచివాలయం సిబ్బంది ద్వారా వికలాంగ పింఛను ఐడి 11090206007తో మంజూరు చేశారు. సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో బోగస్ వ్యవహారం బహిర్గతమైంది. దీంతో స్థానిక టిడిపి నాయకులు నీలకంఠ చౌదరి, సురేష్ నాయుడు లు స్థానిక ఎంపీడీవో ప్రత్యూషకు మంగళవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మండలంలోని ప్రతి పంచాయ తీలో బోగస్ మెడికల్ సర్టిఫికెట్లు పొంది దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నట్లు నెలకు పదివేల రూపా యలు పింఛను పొందుతున్నారని వారు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. మరి కొంతమంది సదరన్ క్యాంపు ద్వారా చెవిటి (వినికిడి వినిపించ లేదని) కేటగిరీకి చెందిన నకిలీ ధ్రువపత్రాలు పొంది పింఛన్లు మంజూరు చేయిం చుకుని ఐదేళ్లగా పింఛన్ పొందారు.. అనర్హులైనా వైసిపికి చెందిన వ్యక్తులకు పింఛన్ మంజూరు చేయాల్సిందేనని వైసిపి పెద్దలు, ప్రజా ప్రతినిధులు అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు.. దీంతో అధికారులు కళ్లు మూసుకొని పింఛను మంజూరు చేశారు. నిన్న చంద్రగిరి మండలం ముంగళి పట్టిలో బోగస్ పింఛన్ల వ్యవ హారం బయట పడింది. నేడు రామచంద్రాపురం మండలంలోని కమ్మపల్లిలో వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా అనుపల్లి, సి రామాపురం, నడవలూరు, కుప్పం బాదురు గంగిరెడ్డిపల్లి, పివిపురం , సికె పల్లి, మిట్ట కండ్రిగ, గ్రామాలలో సామాజిక భద్రత పింఛన్ల మంజూరులో అక్రమాలు ఎక్కువగా జరిగాయని వారు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు జాబితాను క్షుణ్ణంగా రీ వెరిఫికేషన్ చేసి అనర్హుల పింఛన్లను రద్దు చేసి అర్హులైన వారికి మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై ఎంపీడీవో ప్రత్యూష విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విచారణలో పింఛనుకు అనర్హులని తేలితే ఐదు సంవత్సరాలు తీసుకున్న పింఛన్ డబ్బులను రికవరీ చేస్తామని అధికారులు తెలిపారు.

డయేరియాను నిర్మూలిద్దాం..

బుచ్చినాయుడు కండ్రిగలో

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : వెంకటగిరి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో డయేరియా నిర్మూలనపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ సీజన ల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని డిఎంఅండ్హెచ్వో ఆదేశాల మేరకు డయేరి యా, తదితర సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యల పై ర్యాలీ నిర్వహించామని తెలిపారు. దయేరియా వచ్చినా ఆ లక్షణాలు ఉన్న పిల్లలు, పెద్దలు ఆశ వర్కర్లకు, ఏఎన్ఎంలకు తెలిపి జింక్ టాబ్లెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వాడాలని, అప్పటికీ తగ్గకపోతే సమీపంలోని హెల్త్ సెంటర్ను సంప్రదిం చి డాక్టర్ సలహాలు, సూచనల మేరకు ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రబ్బాని బాష, ఎంపిహెచ్ఎ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: మండల కేంద్రంలో డయేరియాపై ఎంపిడిఓ సోమశేఖర్ రెడ్డి, డాక్టర్లు తేజశ్విని, హేమన్త కుమార్రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి సహకారంతో డయేరియాను నివారిద్దామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను 0-5 సంవత్సరాల పిల్లలకు అందించడంతో పాటు, ప్రతి బిడ్డ తల్లికి డయేరియాపై అవగాహన కలిగిస్తామని తెలిపారు. దయేరియా లక్షణాలు వుంటే వెంటనే అలాంటి బిడ్డకు పద్నాలుగు రోజుల పాటు జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడం, అన్ని పాఠశాలల్లోని బడి పిల్లలకు హ్యాండ్ వాష్, పరిశుభ్రత గురించి ఆరోగ్య విద్యను బోధించడం, ర్యాలీలు, సమావేశాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తాగునీటి వనరులలోఎమ్ఎల్ పిల ద్వారా నీటి నాణ్యత పరీక్షించడం, కలుషిత తాగునీటిని క్లోరినేషన్ చేయడం, తదితర ఆరోగ్య సిబ్బంది నిర్వహించాలన్నారు. ప్రతి అవుట్ పేషెంట్ నుండి సిహెచ్ఓలు వారి రోగ వివరాలతో పాటు, వారి చుట్టు పక్కల వారి డయేరియా, జ్వర పీడితుల వివరాలు అడిగి తెలుసుకోవాలని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శేషుకుమారి, ఎంపిహెచ్ఈఓ అమరనాథరెడ్డి, సూపరువైజర్స్ సుబ్రహ్మణ్యం వసంతకుమారి, ఎంఎల్హెచ్పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ దివాకర్ ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు, మండలాధికారి త్రివిక్రమరావు , ఎంఈఓ రవీంద్రనాథ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇందిరా, సిడిపిఓ, మండల అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇందిరా మండలంలోని అరుంధతి మురుగు కాలువలు శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పరిసరాలను పరి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మొగిలమ్మ కాలనీలో 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని మంగళవారం మండల పరిధిలోని నేసనూరు పంచాయతీకి చెందిన మొగిలమ్మ కాలనీలో మండల విద్యాశాఖ అధికారులు బి .తిరుమల రాజు, ఎం బాలసుబ్రమణ్యంలు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూరు శాతం నమోదు చేయాలని, ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి, పాఠశాలలో నమోదు కాని విద్యార్థులను గుర్తించి, స్టూడెంట్స్ డ్రాప్ అవుట్ రేటు తగ్గించడం, విద్య పట్ల అవగాహన, ప్రభుత్వ పథకాల గురించి తెలియజేయుట, పాఠశాల100 శాతం విద్యార్థుల నమోదు, బడి బయట విద్యార్థులు లేకుండా చూడడం, ముఖ్య ఉద్దేశమని మండల విద్యాశాఖ అధికారులు బి .తిరుమల రాజు, ఎం . బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలప్రధానోపాధ్యాయులు సుబ్బరాయణ్, పిల్లారపట్టు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముని లక్ష్మీ, నేషనూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతి,సిఆర్ఎంటిలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

In The Court of the Principal Senior Civil Judge of Tirupati

S.O.P.No.2 / 2024

1) I.Pavani, 2) P.Sohan
Represanted by mother Guardian I.Pavani ...Petitioners
V/s
1) The Post Master (HSG-I) Headpost Office, Tirupati
2) The Branch manager, Union Bank of India, Karvetinagaram
3) The Branch Manager, Union Bank of India, TTD Admin. Branch, Tirupati
4) The Chief Manager, Life Insurance Corporation of India, Division-II, Benguluru ...Respondents

జనరల్ నోటీసు

పై నెంబరు కేసులో పిటీషనర్ ఐ.పావని భర్త లేట్ పి.ఉమాపతి అను అతను చెన్నైలో సాఫ్ట్వేర్ ఇంజనీరుగా పనిచేయుచూ 25.09.2013లో చనిపోయినారు. పి.ఉమాపతి వారసులుగా అతని భార్య ఐ.పావని మరియు అతని కుమారుడు మైనర్ పి.సోహన్ పిటీషనర్స్గా వున్నారు. మరియు పి.ఉమాపతి తండ్రి లేట్ పి.నారాయణ తండ్రి పి.జయరామయ్య టిటిడిలో దఫేదార్గా పనిచేస్తూ 28.11.2018వ తేదినాడు చనిపోయినారు. పి.ఉమాపతి మరియు పి.నారాయణ ఇరువురు చనిపోవడంతో వారికి వారసులుగా పిటీనర్స్ ఐ.పావని, పి.సోహన్లు వారసత్వ సర్టిఫికెట్టు కొరకు పై నంబరు కేసు దాఖలు చేసి వారసత్వము సర్టిఫికెట్టు కొరి ఉంటున్నారు. ఇందులో ఎవరికైన ఎలాంటి అభ్యంతరములు ఉన్న ఎడల పై కోర్టులో తేది. 22.07.2024 న ఉదయం 10.30 గంIIలకు నేరులోగాని, లేక వకీలు ద్వారాగాని హాజరై ఏవేని ఆక్షేపణలున్న యెడల తెలుపోకవల్సినది లేని యెడల సదరు కేసును పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది. 22.07.2024, ఉII 10.30

షెడ్యూలు: 1) పోస్టల్ - నేషనల్ షేవింగ్స్ సర్టిఫికేట్స్ (పి.ఉమామపతి) - రూ.70,200-00
2) ఫిక్స్డ్ డిపాజిట్ -యునియన్ బ్యాంకు కార్వేటినగరం (పి.నారాయణ) - రూ.1,54,339-00
3) పెన్షన్ - యూనియన్ బ్యాంకు - టిటిడి అడ్మిన్ బ్రాంచి (పి.నారాయణ) - రూ.1,00,540-00
4) LIC- పాలసి (పి.ఉమాపతి) బెంగుళూరు - రూ.3,00,000-00

వి.ఉపేంద్రారెడ్డి, అడ్వకేట్,
పిటీషనర్స్, న్యాయవాది, తిరుపతి. సెల్: 9849513720

జాతీయ ఆర్చరీ పోటీలకు మేధాసింగ్ ఎంపిక

జ్ఞాపికను స్వీకరిస్తున్న మేధాసింగ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూలు పాఠశాల విద్యార్థిని మేధాసింగ్ జాతీయ ఆర్చరీ పోటీ లకు ఎంపికైందని ఆ పాఠశాల ప్రిన్సిపల్ శ్రావణి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జూన్ 24వ తేదీ విజయవాడలో నిర్వహించిన అండర్- 13 విభాగంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలలో పాల్గొని జాతీయ స్థాయికి తమ పాఠశాల విద్యార్థిని మేధాసింగ్ ఎంపికైందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని మేధా సింగ్ను అభినందించారు. చిన్న వయసులోనే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషమని తెలిపారు. ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ధన్య వాదాలు తెలిపారు. మేధా సింగ్ భవిష్యత్తు లో మంచి స్థాయికి చేరు కోవాలని ఆకాంక్షించారు. ఆమెకు పాఠశాల తరపున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

చైన్ స్నాచింగ్

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్ : సినిమా ఫక్కీలో మహిళ మెడలోని తాళిబొట్టు లాక్కుని ఇద్దరు దుండగులు పరారైన సంఘటన మంగళవారం సాయంత్రం మండలంలోని తొండమనాడు మార్గం అమ్మపాళెం సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు అమ్మపాళెం గ్రామానికి చెందిన ఓ మహిళ వాకింగ్ చేస్తూ వెళుతుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై రోడ్డు పక్కన నిలుచుని ఉన్నట్లు సమాచారం. మహిళ అటువైపు వెళ్లగానే ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి వున్న వారు మెడలో తాళిబొట్టు లాక్కుని మిట్ట కండ్రిగ వైపు పరారైనట్లు తెలిపారు. ఈ ఘటనతో పరిసర ప్రాంత మహిళలు భయాందోళన చెందుతున్నారు.

జీవో 117ను రద్దు చేయండి

ఎమ్మెల్యేకి ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: వివిధ విద్యారంగ సమస్యలతో పాటూ జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని, పాఠశాలల విలీనాన్ని రద్దుచేసి పూర్వ స్థితిని కల్పించాలని, ఏకోపాధ్యాయ పాఠశాలను బహుళ ఉపాధ్యాయ పాఠశాలలుగా మార్చాలని కోరుతూ సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకి ఆపస్ నాయకులు మంగళవారం నారాయణవనంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆపస్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించనున్న మెగా డీఎస్సీలో దాదాపు 40 వేల ఉపాధ్యాయ ఖాళీలకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ వల్ల ఖాళీ అయిన సబ్జెక్టు టీచర్ల కొరత స్కూళ్లకు వర్క్ అడ్జెస్ట్ మెంటు కింద టీచర్లను డిప్యూటేషన్ వేయాలని కోరారు. ఈ సమస్యలన్నింటిని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు తూకివాకం నాగరాజు, జిల్లా మీడియా కన్వీనర్ జగదీష్ పాల్గొన్నారు.

బాధ్యత నెరవేర్చా..

- మాజీ డిఆర్యుసిసి మెంబర్ మయూరి శ్యామ్ యాదవ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్లో మౌలిక సదుపాయాలు, ప్రయాణికులకు వసతుల కల్పనకు కృషి చేయడం ఎంతో ఆనందంగా ఉందని మాజీ డిఆర్యు సిసి మెంబర్ మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో డిఆర్యుసిసి మెంబర్గా గత నాలుగు సంవత్సరాల కాలం 2020-21, 22-,23 లకు జులై 30వ తేదీతో కాల పరిమితి పూర్తి అయిందని పేర్కొన్నారు. ఈ నాలుగు సంవత్సరాలలో రైల్వే స్టేషన్లోని ప్రధాన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. దీనికి సహకరించిన రైల్వే డిఆర్ఎం, ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

సచివాలయ సిబ్బంది పనితీరు భేష్: టిడిపి

ఉద్యోగులను అభినందిస్తున్న టిడిపి నాయకుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం లోని లబ్ధిదారులకు పింఛన్ పంపిణీలో సచివాలయ సిబ్బంది పనితీరు భేష్గా వుందని ఆ మండల టిడిపి అధ్యక్షులు గాలి మురళి నాయుడు కొనియాడారు. కొణతనేరి గ్రామ సచివాలయంలో మంగళవారం ఆయన పర్యటించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికన్నా ముందే నూరు శాతం లబ్ధిదారులకు పింఛన్ బట్వాడా చేయడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. అన్ని పంచాయతీల్లో అర్హులైన పేదవారందరికీ ప్రభుత్వం జీవో విడుదలైన వెంటనే పెన్షన్ మంజూరయ్యేలా చూడలని కోరారు. మాజీ సర్పంచ్ మధు నాయుడు, పులి కస్తూరయ్య పాల్గొన్నారు.

పొదుపుపై అవగాహన కల్పించాలి: ఏపీఎం

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో పొదుపు సంఘాలు సభలు పెట్టి పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వెలుగు ఏపీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉన్న స్త్రీ శక్తి భవనంలో పొదు పు సంఘాల పై సమీక్ష సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి సభలో నిర్వహించలేదని వెంటనే ప్రతి గ్రామాల్లో పొదుపు సభ్యులు నిర్వహించి ఇప్పటివరకు ఎంతమంది బ్యాంకుల ద్వారా రుణాలు పొందారు? వారి వద్ద నుంచి వెంటనే రికవరీ చేయించే బాధ్యత వివో ఏలు పైన ఆధారపడి ఉందని తెలిపారు. అంతేకాకుండా పొదుపు సంఘాల్లో మొండి బాకీలు ఉంటే వారికి సబ్సిడీ వర్తించదని గ్రామసభలో తెలిపి వాళ్ళ వద్దకు వెళ్లి వెంటనే రికవరీ చేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఆడికృత్తిక ఏర్పాట్లపై సమావేశం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: పాకాల మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీ ఊట్లవారిపల్లి సమీపంలో ఆనందగిరిపై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆడికృత్తిక ఉత్సవాల నిర్వహణపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం అధికారులతో, స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, స్థానికులు కలిసి ఎమ్మెల్యే గజమాల వేసి శాలువాతో సత్కరించారు.

IN THE COURT OF THE DISTRICT MUNSIF - PONNERI
I.A. 7 /2022
IN
O.S.244 / 2012

Govindarajan & others
... **Petitioners / Plaintiffs**
Vs.
P.G. Narayanan & others
...**Respondents /Defendants**
To:-
R-4 Mr. ValluriVeerajaju Chowdri S/o.Valluri Chinna Sathyaraju, Mandapet village & Mandalam East Godavari District, Andhra Pradesh.

NOTICE

Take notice that the above petitioners / plaintiffs filed O.S. 244/ 2012 for Declaration, Mandatory and permanent injunction against you and I.A. 7 / 2022 filed for amendment of the plaint in the pending suit, the above application came up for the hearing date 12.07.2024, You should appear in person or through counsel at 10.30 A.M before the above said court failing which the matter will be decided in your absence.

N.R.Gopaalan
Advocate for Petitioners / Plaintiffs

IN THE COURT OF THE DISTRICT MUNSIF - PONNERI
I.A. 8 /2022
IN
O.S.244 / 2012

Govindarajan & others
... **Petitioners / Plaintiffs**
Vs.
P.G. Narayanan & others
...**Respondents /Defendants**
To:-
R-4 Mr. ValluriVeerajaju Chowdri S/o.Valluri Chinna Sathyaraju, Mandapet village & Mandalam East Godavari District, Andhra Pradesh.

NOTICE

Take notice that the above petitioners / plaintiffs filed O.S. 244/ 2012 for Declaration, Mandatory and permanent injunction against you and I.A. 8 / 2022 filed for amendment of the plaint in the pending suit, the above application came up for the hearing date 12.07.2024, You should appear in person or through counsel at 10.30 A.M before the above said court failing which the matter will be decided in your absence.

N.R.Gopaalan
Advocate for Petitioners / Plaintiffs

IN THE COURT OF THE DISTRICT MUNSIF - PONNERI
I.A. 6 /2022
IN
O.S.244 / 2012

Govindarajan & others
... **Petitioners / Plaintiffs**
Vs.
P.G. Narayanan & others
...**Respondents /Defendants**
To:-
R-4 Mr. ValluriVeerajaju Chowdri S/o.Valluri Chinna Sathyaraju, Mandapet village & Mandalam East Godavari District, Andhra Pradesh.

NOTICE

Take notice that the above petitioners / plaintiffs filed O.S. 244/ 2012 for Declaration, Mandatory and permanent injunction against you and I.A. 6 / 2022 filed for amendment of the plaint in the pending suit, the above application came up for the hearing date 12.07.2024, You should appear in person or through counsel at 10.30 A.M before the above said court failing which the matter will be decided in your absence.

N.R.Gopaalan
Advocate for Petitioners / Plaintiffs